సాక్షి సూర్యాపేట

మంగళవారం । 30 । జూలై । 2024



పంట మార్పిడితోనే...
పంట మార్పిడితోనే భూసారం పెరుగుతుందని కంపాసాగర్ కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. - 10లో



సమస్యలు పరిష్కరించాలి
వికలాంగుల సమస్యల పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ అన్నారు. - 10లో



వసూళ్లపై సీఐ విచారణ
నేరేడుచర్లలో చిరువ్యాపారుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్న హోంగార్డులపై సీఐ విచారణ చేపట్టారు. - 10లో

న్యూస్‌రీల్

పలువురు ఎస్‌ఐల బదిలీ

సూర్యాపేట టౌన్: జిల్లాలో పలువురు ఎస్‌ఐలు సోమవారం బదిలీ అయ్యారు. ఈ మేరకు పోలీస్ మల్టీజోన్-2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. నాగారం స్టేషన్ ఎస్‌ఐ పి.వెంకట్‌రెడ్డి సూర్యాపేట వీఆర్‌కు బదిలీ అయ్యారు. సూర్యాపేట టౌన్-2 ఎస్‌ఐ మహేంద్రనాథ్ నూతనకల్ పోలీస్ స్టేషన్‌కు, నూతనకల్ ఎస్‌ఐ జె.సైదులు వీఆర్ సూర్యాపేటకు, తిరుమలగిరి ఎస్‌ఐ కె.సత్యానారాయణ వీఆర్ సూర్యాపేటకు, సూర్యాపేట టౌన్-1 ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ అర్వపల్లికి బదిలీలయ్యారు. అలాగే అర్వపల్లి ఎస్‌ఐ యాకుబ్ వీఆర్ సూర్యాపేటకు వచ్చారు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా వి.సురేష్, నాగారం ఎస్‌ఐగా ఎం.ఐలయ్యలు బదిలీపై వచ్చారు.

నేడు సీపీఐ మహిళా సమాఖ్య జిల్లా సమావేశం

నేరేడుచర్ల: సీపీఐ అనుబంధ మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం నేరేడుచర్లలో నిర్వహిస్తున్నట్లు ఆ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉస్తేల సృజన, దేవర మల్లేశ్వరి, సీపీఐ జిల్లా నేత ధనుంజయ నాయుడు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాడుదాం



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

గరిడేపల్లి: కార్మిక హక్కుల సాధనతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సమష్టిగా పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామ సమీపంలోని ఎంబీఆర్ ఫంక్షన్ హాల్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల చిన్న, మధ్యతరగతి పరిశ్రమల యాజమాన్యాలు, వేలాది మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనంగా నెలకు రూ.26వేలు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చెరుకు ఏకలక్ష్మి, శ్రీలం శ్రీను, ఎస్.రాధాకృష్ణ, షేక్ యాకూబ్, అనంత ప్రకాష్, వట్టెపు సైదులు, ఎం.ముత్యాలు, షేక్ రన్మియా, రామ్మూర్తి, జి.సత్యం, బాలకృష్ణ, కొండ సైదులు, నాగరాజు, ముత్తయ్య, శ్రీను, రావుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దూర విద్య డిగ్రీ, పీజీలో అడ్మిషన్లు

నల్లగొండ రూరల్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ఆగస్టు 18లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఎన్జీ కాలేజీ దూర విద్య కేంద్ర కోఆర్డినేటర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరంలో డిగ్రీ, పీజీ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ద్వితీయ, తృతీయ సంవత్సరం డిగ్రీ అభ్యర్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ ఓల్డ్ బ్యాచ్ విద్యార్థులు 2, 3 సంవత్సరాల్లో ఫీజు చెల్లించలేకపోయిన వారు, 2015-16 నుంచి 2023-24 వరకు అడ్మిషన్ పొంది ఉంటే ట్యూషన్ ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. వివరాలకు 9533101295, 7989339180 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మహాశివుడికి విశేష పూజలు




స్పటిక లింగానికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయంలోనూ నిత్యారాధనలు కొనసాగాయి. నిత్యకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవలు, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

బిరాబిరా కృష్ణమ్మ..





తెరుచుకున్న శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు

- నాగార్జునసాగర్ వైపు కదిలిన కృష్ణవేణి
- మూడు క్రస్ట్‌గేట్ల నుంచి, విద్యుదుత్పాదన ద్వారా నీటి విడుదల
- సాగర్‌కు లక్షా 17వేల క్యూసెక్కుల నీరు రాక
- వేగంగా నిండనున్న సాగర్ ప్రాజెక్టు

నాగార్జునసాగర్: పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో నాగార్జునసాగర్ వైపు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరువకావడంతో సోమవారం సాయంత్రం మూడు క్రస్ట్‌గేట్లు ఎత్తి 76,056 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పాటు విద్యుదుత్పాదన ద్వారా 61,810 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మొత్తంగా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 1,17,866 క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నుంచి వేగంగా పెరగనుంది.

ముందుగానే గేట్లు ఎత్తారు

శ్రీశైలం నుంచి సాగర్ మధ్య నది దూరం 85కిలోమీటర్లు కాగా.. శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల గుండా వచ్చే నీరు సాగర్ చేరడానికి ఆరుగంటల వ్యవధి పడుతుంది. సోమవారం రాత్రికే సాగర్ జలాశయానికి నీరు చేరింది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన ఉన్న ఆల్మట్టి డ్యాం నుంచి వచ్చే వరద ఇలాగే కొనసాగితే శ్రీశైలంలోకి వచ్చే నీటిని వచ్చినట్టే.. నాగార్జునసాగర్ జలాశయంలోకి విడుదల చేస్తారు. శ్రీశైలం జలాశయానికి జూరాల, తుంగభద్ర నుంచి 4,51,080 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. వాస్తవంగా శ్రీశైలం జలాశయం గరిష్ట స్థాయికి చేరుకొని కనీసం 200టీఎంసీల నీరు చేరితే అప్పుడు గేట్లు ఎత్తుతారు. కానీ, వరద తీవ్రత ఎక్కువగా ఉండటంతో నదిలో ఉన్న వరదను అంచనా వేసి ముందుగానే గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ఇదే రీతిలో వరద కొనసాగితే శ్రీశైలం ప్రాజెక్టులో మరికొన్ని గేట్లు ఎత్తే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు. అలా అయితే సాగర్ జలాశయం కూడా త్వరలోనే నిండనుంది.

ఈయేడు కరుణించింది..

గత యేడాది పెద్దగా వర్షాలు పడకపోవడంతో వరద శ్రీశైలం ప్రాజెక్టు వరకు వచ్చి ఆగింది. గత పదేళ్లుగా జూలై మొదటివారం నుంచి వరదలు మొదలై సాగర్ జలాశయానికి జూలై చివరి వారంలో రావడం ఆనవాయితీగా వస్తుంది. ఆగస్టు మొదటి వారం నుంచి రెండవ వారంలో సాగర్ గేట్లెత్తిన సందర్భాలే అధికం.

కృష్ణా తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ, నాగార్జునసాగర్ : కృష్ణా నది తీర ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద ఉధృతి పెరగడంతో గేట్లెత్తి దిగువ కృష్ణా నదిలోకి నీటిని విడుదల చేస్తున్నందున.. నదీ తీర ప్రాంతాల్లోని రైతులు, జీవాల కాపరులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పశులవులను నదీపాయల ద్వారా గుట్టలమీదకు తోలవద్దని, జీవాలను మేపేందుకు తరలించవద్దని సూచించారు. నదినుంచి మోటార్ల ద్వారా నీటిని తరలించేవారు వాటిని తొలగించుకోవాలని తెలిపారు. మత్స్యకారులు వలలను నదిలోనుంచి తీసివేసుకోవాలని తెలిపారు. జలాశయం నీటిమట్టం పెరుగుతున్నందున తీర ప్రాంతంలో సాగు చేసే రైతులంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.



అప్రమత్తమైన అధికారులు

శ్రీశైలం ప్రాజెక్టు నీటి విడుదలతో ఎగువ నుంచి వస్తున్న వరద పట్ల నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. డ్యాం డివిజన్‌లో ఉద్యోగుల కొరత ఉండటంతో.. ప్రాజెక్టు పరిధిలోగల ఉద్యోగులందరినీ సాగర్‌కు పలిపించి వీరికి డ్యాంపై విధులు నిర్వహించేందుకు డ్యూటీలు వేసే పనిలో ఉన్నారు.

పాలెఅన్నారం పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

- సంఘం పాలకవర్గ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
- తీర్మాన ప్రతిని జిల్లా సహకార సంఘానికి అందజేత



సస్పెండ్ అయిన సీఈఓ సాకి వెంకటేశ్వర్లు

చిలుకూరు: మండలంలోని పాలెఅన్నారం (నారాయణపురం) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ సాకి వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటుపడింది. సోమవారం సంఘం కార్యాలయంలోని జరిగిన పాలవర్గం సమావేశంలో సీఈఓను సస్పెండ్ చేస్తూ సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సంఘంలోని 12 మంది సభ్యులకు 10 మంది హాజరు కావడంతో కోరం సరిపడా ఉంది. దీంతో సంఘం సమావేశం నిర్వహించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సంఘం చైర్మన్ కొండా సైదులు విలేకరులతో మాట్లాడుతూ సంఘం సీఈఓగా పనిచేస్తున్న సాకి వెంకటేశ్వర్లు 7వ తరగతి వరకు చిలుకూరు జెడ్పీహెచ్ఎస్‌లో చదివి ఆ తరువాత 10వ తరగతి హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో చదివారని తెలిపారు. రెండు చోట్ల చదివిన స్టడీ సర్టిఫికెట్లలో పుట్టిన తేదీలు వేర్వేరుగా ఉన్నాయని, ఉద్దేశపూర్వకంగానే అతను పదో తరగతితో తక్కువ వయస్సు నమోదు చేయించుకున్నారని పేర్కొన్నారు. 2018లో పదవీ విరమణ పొందాల్సిఉన్నప్పటికీ ఇంకా ఉద్యోగం చేస్తున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా సహకార సంఘం అధికారులు విచారణ చేయగా నిజనిజాలు బయటపడ్డాయన్నారు. అయితే సీఈఓపై సంఘ సభ్యులే చర్యలు తీసుకోవాలని డీసీఓ కార్యాలయ వర్గాలు సూచించగా సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి సీఈఓను సస్పెండ్ చేసినట్లుగా తెలిపారు. అంతేకాక సీఈఓపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం సంఘం తాత్కాలిక సీఈఓగా సంఘంలో పనిచేస్తున్న గండ్ర పూర్ణయ్యకు బాధ్యతలు అప్పగించినట్లుగా తెలిపారు. ఈ తీర్మానం జిల్లా సహకార సంఘానికి పంపామన్నారు. ఈ వ్యవహారంపై ఈ ఏడాది ఏప్రిల్ 22న 'సాక్షి'లో 'సర్టిఫికెట్లలో వేర్వేరుగా పుట్టిన తేదీలు' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనం ఆధారంగానే జిల్లా సహకార సంఘం అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు.



సీఈఓ తప్పుడు పుట్టినతేది స్టడీ సర్టిఫికెట్ల వ్యవహారంపై సాక్షిలో వచ్చిన కథనం (ఫైల్)

సివిల్స్ ఉచిత శిక్షణకు ఆగస్టు 11న ప్రవేశ పరీక్ష

సూర్యాపేట టౌన్: ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షకు సంబంధించి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని సూర్యాపేట ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్.రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోని వారు ఉంటే ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఆగస్టు 7వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రెండో విడతలో 26,376 మందికి..

- రూ.లక్షన్నర వరకు రుణాలున్న రైతులకు నేడు మాఫీ
- కలెక్టరేట్‌లో సంబరాలకు ఏర్పాట్లు చేసిన అధికారులు

భానుపురి (సూర్యాపేట): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే రూ.లక్ష వరకు ఉన్న రుణాలను మాఫీ చేయగా.. రెండో విడతలో భాగంగా రూ.లక్షన్నర వరకు రుణాలు ఉన్న రైతుల అకౌంట్లో మంగళవారం నుంచి డబ్బులు జమ చేసేందుకు సిద్ధమైంది. జిల్లాలో రూ.లక్ష వరకు రుణాలు ఉన్న 56,217 మంది రైతు కుటుంబాలకు రూ.282.78 కోట్ల నిధులను ఇప్పటికే జమ చేసి రుణమాఫీ చేసింది. ఇక, మంగళవారం రెండో విడత రూ.లక్షన్నర వరకు రుణాలు ఉన్న 26,376 మంది రైతులకు రుణమాఫీ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనున్నారు. రెండో విడతలో రూ.250 కోట్ల నిధులు రైతుల అకౌంట్లో జమ కానున్నాయి. రుణమాఫీ ప్రక్రియను పండుగలా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. మొదటి విడత రైతు వేదికల్లో సంబరాలు చేపట్టగా రెండో విడత జిల్లా కలెక్టరేట్‌లో లబ్ధిదారుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తంగా జిల్లాలో రెండు విడతల్లో కలిపి 82,593 రైతు కుటుంబాలకు రూ.532.78 కోట్ల నిధులను విడుదల చేసినట్లవుతుంది.

వైభవంగా నారసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో సోమవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టారు. ఆ తర్వాత విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు పూర్తిచేశారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించి ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దివ్యాంగుల సంక్షేమానికి పాటుపడాలి



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

సూర్యాపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమానికి పాటుపడాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కర్నాటి జయకృష్ణ, ప్రధాన కార్యదర్శి కుర్రి నాగయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో దివ్యాంగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జయకృష్ణ, నాగయ్య మాట్లాడారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షులుగా చింత సాంబయ్య, కొరివి సైదులు, కార్యదర్శులుగా బత్తుల జంపయ్య, నాగవెల్లి కరుణాకర్, సహాయ కార్యదర్శులుగా మెంతబోయిన అంజయ్య, రాసమల్ల మల్సూర్, కోశాధికారిగా పఠాని ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మధనాచారి, చింత సతీష్, బెంజరపు భిక్షపతి, ఎం.డీ.జహీర్‌బాబా, సపావత్ సాగర్‌నాయక్, ఏలె జానయ్య, గాజుల రాము, పోతురాజు నాగరాజు, నల్లెడ మాధవరెడ్డి, హర్షియ, కృష్ణవేణి, సుజాత, కాంతమ్మ, నల్లగొండ నాగయ్య, మిద్దె సైదులు, శ్రీనివాసాచారి, కొండ సైదులు, యాదగిరి, లూనావత్ మహేష్, రవి, నాగేష్, చంద్రమౌళి, మల్లయ్య, అఖిల్, ఫరీద్ బాబా, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతను పెడదారి పట్టిస్తున్న పాలకులు

నల్లగొండ టౌన్: దేశంలోని పాలకులు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచి కులం, మతం ప్రాంతాల పేరుతో రెచ్చగొడుతూ యువతను పెడదారి పట్టిస్తున్నాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర విమర్శించారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత టెర్రరిస్టులుగా, గంజాయికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూడిద సురేష్, ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు లింగానాయక్, షరీఫ్, అన్నమల్ల నవీన్, గడ్డం నవీన్, మల్లేష్, బండారు శంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మేంద్ర

అధికారుల కనుసన్నల్లోనే..

- తహసీల్దార్ ఆఫీసుల్లో ధరణి దందా
- నిబంధనలకు విరుద్ధంగా నాలా కన్వర్షన్ భూముల రిజిస్ట్రేషన్లు
- అవినీతి కేంద్రాలుగా మారిన కార్యాలయాలు
- ప్రతి ఖర్చుకు ధరణి ఆపరేటర్ల నుంచే వసూలు

కోదాడ: జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి పోర్టల్‌తో దందాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయాల్లో అయ్యే ప్రతిపైసా ఖర్చు ధరణి ఆపరేటర్ల నుంచే వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగి రైతు నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ దొరికిపోవడంతో అతన్ని జిల్లా కలెక్టర్ ఉద్యోగం నుంచి తొలగించిన విషయం విదితమే. ఈ వ్యవహారంలో ఉద్యోగం పోగొట్టుకున్న ధరణి ఆపరేటర్ జిల్లా కలెక్టర్‌కు తమ గోడును వెల్లబోసుకుంటూ మూడు పేజీల లేఖను రాయడం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది.

మా నుంచే వసూలు చేస్తున్నారని..

తహసీల్దార్ కార్యాలయాల్లో కరెంట్ బిల్లులు, నెట్ బిల్లులు, పేపర్ బండిళ్లతో పాటు కార్యాలయాలకు వచ్చే ఉన్నతాధికారులకు మినరల్ వాటర్ బాటిళ్లతో పాటు టీ, బిస్కట్ ఖర్చులను కూడా మా నుంచే వసూలు చేస్తున్నారని, గడిచిన 7 నెలలుగా మాకు వేతనాలు కూడా ఇవ్వడం లేదని సదరు ఆపరేటర్ తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగే ధరణి దందాను ఆ లేఖలో కలెక్టర్‌కు వివరించారు.

నాలా కన్వర్షన్ భూములకు ఎకరాల్లో రిజిస్ట్రేషన్..

కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో నాలా కన్వర్షన్ అయిన భూములను నిబంధనలకు విరుద్ధంగా గుంట, రెండు గుంటలు, ఎకరాల్లో రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి కోదాడ మండలం చిమిర్యాల రెవెన్యూ, గ్రామ పంచాయతీ పరిధిలో సర్వేనంబర్ 570, 573లో 12 ఎకరాలకుపైగా భూమిని కొనుగోలు చేసి దానిని ప్లాట్లుగా విభజించి అమ్మాలనుకున్నాడు. దీని కోసం నాలా కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీనికి అధికారులు ప్రొసీడింగ్ నంబర్ బి/1719/2019 తేది 14-02-2020న నాలా కన్వర్షన్‌కు అనుమతి ఇచ్చారు. నాలా కన్వర్షన్ అయిన ఈ భూముల్లో అనధికార లేఅవుట్లను ఏర్పాటు చేసి కొన్ని ప్లాట్లను కోదాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ధరణి పోర్టల్‌లో ఎంత చిన్న విస్తీర్ణమైనా రిజిస్ట్రేషన్ చేసే వెసులుబాటు ఉండడంతో సదరు రియల్ వ్యాపారి అధికారులను మచ్చిక చేసుకొని నాలా కన్వర్షన్ భూములకు అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకం(నంబర్: టి 29090111505) తీసుకొన్నాడు. మరొకరికి ఎకరాల్లో రిజిస్ట్రేషన్ చేశారు. ఇతనికి ధరణి ద్వారా పాసు పుస్తకం (నంబర్: టి 29090112280) ఇచ్చారు. ఇతను మరోసారి నాలాభూముల్లో ఇళ్ల ప్లాట్లను గుంట, రెండు గుంటలకు రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా ఏకంగా 150 ప్లాట్లను కోదాడ తహసీల్దార్ కార్యాలయ అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు.



కోదాడ తహసీల్దార్ కార్యాలయం

రెండు గుంటల రిజిస్ట్రేషన్‌కు వీలులేదు

నాలా కన్వర్షన్ అయిన భూమిని గుంట, రెండు గుంటలుగా విభజించి రిజిస్ట్రేషన్ చేయడానికి వీలు లేదు. నాలా కన్వర్షన్ అయిన భూమిని ప్లాట్లుగా విభజించిన తర్వాతే లేఅవుట్ అనుమతి తీసుకొని గజాల్లో మాత్రమే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అమ్ముకోవాలి.

– సూర్యనారాయణ, ఆర్డీఓ కోదాడ

పంచాయతీకి ఇచ్చిన 10 శాతం భూమిని కూడా..

కోదాడ మండలం నల్లబండగూడెం పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 557, 558, 559లో సుమారు 20 ఎకరాల భూమిని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్లాట్లుగా అమ్మడానికి నాలా కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకోగా ప్రొసీడింగ్ నంబర్ : బి/1718/2019 తేది 19-03-2020న అనుమతి ఇచ్చారు. భూమిని మొత్తం అనధికార లేఅవుట్‌గా ప్లాట్ల అమ్మకాలు జరిగాయి. ఆ తర్వాత ఈ మొత్తం భూమికి నిబంధనలకు విరుద్ధంగా కోదాడ తహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టాదారు పాసుపుస్తకం (నంబర్:టి 29090111505) ఇచ్చారు. ఈ భూమిలో ప్లాట్లు రిజిస్ట్రేషన్ కాగా పంచాయతీకి సామాజిక అవసరాల కోసం ఇచ్చిన 10 శాతం భూమిని తేది 15-07-2024న సర్వేనంబర్ 558లో ఎకరం 20 గుంటలు, 559లో మూడు ఎకరాలను అధికారులు మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారు. గతంలో ఈ భూముల్లో ఏర్పాటు చేసిన లే అవుట్‌కు పంచాయతీ అనుమతి లేదని అందులోని ప్లాట్ల హద్దురాళ్లను అధికారులే తొలగించారు. ఇటువంటి భూములకు రైతుబంధు మంజూరు కావడం.. ఇదంతా అధికారులకు తెలిసినా కాసులకు కక్కుర్తిపడి అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా

హోంగార్డుల వసూళ్లపై సీఐ విచారణ



నేరేడుచర్ల స్టేషన్‌లో విచారణ జరుపుతున్న హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు

నేరేడుచర్ల: పట్టణంలోని చిరు వ్యాపారులకు డబ్బులు చెల్లించకుండా ముగ్గురు హోంగార్డులు ఉచితంగా నిత్యావసర సరుకులు తీసుకెళ్తున్నట్లు సోమవారం వివిధ దినపత్రికల్లో వార్తా కథనాలు ప్రచురితం కాగా.. ఈ ఘటనపై హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు. అంతకు ముందు నేరేడుచర్లలోని చిరు వ్యాపారులతో సీఐ మాట్లాడారు. సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు హోంగార్డులపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టామని, దీనిపై నివేదికను ఎస్పీకి అందజేస్తామని సీఐ పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కోదాడరూరల్: పట్టణ పరిధిలోని శ్రీమన్నారాయణ కాలనీ బీసీ హాస్టల్ వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్యలో ఉంటుందని, వివరాలు తెలిసిన వారు కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

హరితహారం చెట్ల నరికివేత



వేపలసింగారం శివారులో హరితహారం చెట్లను నరికిన గుర్తుతెలియని వ్యక్తులు

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని వేపలసింగారం మీదుగా మేళ్లచెరువు వెళ్లే రహదారి పక్కన ఎఫ్‌సీఐ గోదాముల నుంచి వేపలసింగారం వరకు రెండేళ్ల క్రితం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కానుగ మొక్కలు నాటారు. అవి పెరిగి ఇప్పుడిప్పుడే చెట్లుగా మారుతున్న క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారని గ్రామస్తులు సోమవారం తెలిపారు. రహదారి పక్కన ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్



అభివాదం చేస్తున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు

సూర్యాపేట: వికలాంగుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ అన్నారు. సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సూర్యాపేట జిల్లా 3వ మహాసభ పట్టణంలోని మార్కెట్ యార్డులో జిల్లా అధ్యక్షుడు ఎ. లింగన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. ఉద్యోగ నియామకాల్లో శారీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గించాలని, వికలాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా వికలాంగుల కోసం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల్లో అక్రమాలు జరిగాయని, నిధుల పర్యవేక్షణలో వికలాంగుల సంక్షేమ శాఖ విఫలమైందన్నారు. ఆర్థిక సంవత్సరం చివర్లో నిధులు విడుదల చేయడం ద్వారా లబ్ధిదారులు నష్టపోతున్నారన్నారు. వికలాంగుల పెన్షన్ నిధులను ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి అనేక పథకాల ప్రచారానికి వినియోగిస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపుల్లో వికలాంగులకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 10.48లక్షల మంది వికలాంగులు ఉన్నారని, ఓ రిపోర్ట్ ప్రకారం 43.02లక్షల మంది ఒకటి కంటే ఎక్కువ వైకల్యాలు కలిగి ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులాలకు ఇస్తున్న ప్రాధాన్యత వికలాంగులకు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎ. లింగన్న, కార్యదర్శి వెంకన్న, జిల్లా నాయకులు చినపంగి నర్సయ్య, ఆర్షియా, కృష్ణ, వీరమల్లు, భిక్షపతి, వనిత, నర్సిరెడ్డి, కిరణ్, గోపి, సంతోష్, రామ్‌కుమార్, నర్సయ్య, శ్రీనివాస్, సంతోష్‌కుమార్, జక్కా వెంకన్న, దాసరి శ్రీను, వెంకట్, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి సబ్ పోస్టుమాస్టర్‌కు అవార్డు



ఉప్పలయ్య

తిరుమలగిరి : తెలంగాణ పోస్టల్ సర్కిల్ 2023–24 సంవత్సరానికి ప్రకటించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డుల్లో తిరుమలగిరి సబ్ పోస్టుమాస్టర్ మొగుళ్ల ఉప్పలయ్యకు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి లభించింది. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రతి సంవత్సరం ఎక్సలెన్సీ అవార్డులను అందజేస్తుంటారని, ఉత్తమ పార్సిల్ డెలివరీ విభాగంలో తిరుమలగిరి సబ్ పోస్టాఫీస్ పరిధిలోని వివిధ బ్రాంచ్‌ల్లో రిజిస్టర్, డెలివరీ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను తనకు ఈ అవార్డు లభించిందని ఉప్పలయ్య పేర్కొన్నారు. తెలంగాణ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ పి. విద్యాసాగర్ చేతులమీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

- పార్లమెంట్‌లో ప్రస్తావించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చౌటుప్పల్: చౌటుప్పల్, పోచంపల్లి మండలాల్లోని ఫార్మా, కెమికల్ పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సోమవారం పార్లమెంట్‌లో ప్రస్తావించారు. ప్రధానంగా 10–15 పరిశ్రమలు నిరంతరాయంగా రసాయనాలు, రసాయన వాయువులను వదులుతుండడంతో ఆయా మండలాల్లో భూమి, నీరు, గాలి కాలుష్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా పరిశ్రమలు బడా కార్పొరేట్ సంస్థలకు చెందినవి కావడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తు ఆయా పరిశ్రమలను కాలుష్యరహిత కేటగిరీలో పెట్టారని తెలిపారు. పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తల ద్వారా ఆయా పరిశ్రలు, ప్రాంతాలను పరిశీలన చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగిక దాడి

శాలిగౌరారం: కామంతో కళ్లు మూసుకుపోయిన వ్యక్తి మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శాలిగౌరారం మండలంలో సోమవారం జరిగింది. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శాలిగౌరారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలు(17)పై అదే గ్రామానికి చెందిన దశరథ(50) అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి, నిందితుడు దశరథది ఒకే సామాజిక వర్గం కాగా వరుసకు అన్నదమ్ములు. ఇద్దరు కలిసి కొంత కాలంగా ఒకే రకమైన వృత్తిని కలిసి చేస్తున్నారు. ఈ క్రమంలో నిందితుడు దశరథ నిత్యం బాధితురాలి ఇంటికి వచ్చి పోతుండేవాడు. సోమవారం బాధితురాలి తల్లిదండ్రులు పనులకు వెళ్లిపోగానే ఇదే అదునుగా భావించిన నిందితుడు దశరథ ఇంట్లో ఒంటరిగా ఉన్న మానసిక దివ్యాంగురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు మానసిక దివ్యాంగురాలైన కుమార్తె జరిగిన విషయం చెప్పింది. దీంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని బాధితురాలిని వైద్య పరీక్షలకు తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు. నిందితుడు గతంలోనూ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై ఇదే తరహాలో ప్రవర్తించగా ఇరు గ్రామాల పెద్దమనుషుల సమక్షంలో జరిమానా విధించినట్లు స్థానికులు చెప్పారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక



నక్క సాయిశ్రీ

గరిడేపల్లి : ఇండియా, జపాన్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం సకురలో భాగంగా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి మోడల్ కాలేజీకు చెందిన నక్క సాయిశ్రీ రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. శనివారం సూర్యాపేటలోని బాల్ భవన్‌లో జిల్లా వ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన పోటీ పరీక్షలో సాయిశ్రీ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలో ఆమె పాల్గొననుంది. సకురా ప్రోగ్రాంలో భాగంగా జపాన్‌లో నిర్వహించబోయే 3 వారాల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కోసం ప్రతి రాష్ట్రం నుంచి టాప్ 5లో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి తీసుకెళ్లనున్నారు. ఈ సందర్భంగా సాయిశ్రీని, ఆమె గైడ్, జువాలజీ లెక్చరర్ పాటలీ చంద్రని, ప్రిన్సిపాల్ అభినందించారు. ఆమె రాష్ట్ర స్థాయిలో టాప్ 5లో నిలిచి ఇంటర్న్‌షిప్‌కు జపాన్ వెళ్లాలని ఆకాంక్షించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిప్పర్తి: నకిరేకల్ మండలం గోరెంకలపల్లికి చెందిన ముద్దంగుల రాంబాబు సోమవారం చందుపట్ల వాగు నుంచి తిప్పర్తికి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా తిప్పర్తి శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తిప్పర్తి ఎస్ఐ డి. రాజు తెలిపారు.

గంజాయి నిర్మూలనపై అవగాహన

తిప్పర్తి: మండలంలోని గంగన్నపాలెం గ్రామంలో సోమవారం పోలీసులు గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ లింగయ్య మాట్లాడుతూ.. గంజాయి వలన యువకులు తమ ఉజ్వల భవిష్యత్తును కోల్పోతున్నారని, గంజాయి వలన కలిగే దుష్ఫలితాలను గ్రామస్తులకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ రిమాండ్

నేరేడుచర్ల: చోరీలకు పాల్పడుతున్న దొంగను సోమవారం నేరేడుచర్ల పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా మేడిపల్లి మండలానికి చెందిన సంపంగి రవి ఈ నెల 28వ తేదీన నేరేడుచర్ల బస్టాండ్‌లో ప్రయాణికుడు బస్సు ఎక్కుతుండగా అతడి పర్సు దొంగతనం చేస్తూ పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి పర్సు స్వాధీనం చేసుకున్న పోలీసులు సోమవారం హుజూర్‌నగర్ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై పలు స్టేషన్లలో 11 కేసులు ఉన్నాయని, గతంలో జైలుకు కూడా వెళ్లి వచ్చాడని ఎస్ఐ తెలిపారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేదీ..



రైతు బజార్‌లో పడేసిన కుళ్లిన కూరగాయలు



గాఢ నిద్రలో రైతు బజార్ సూపర్‌వైజర్

- అధ్వానంగా రైతు బజార్
- పట్టించుకోని సూపర్‌వైజర్

మిర్యాలగూడ: పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నప్పటికీ కొందరు అధికారుల నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిర్యాలగూడ పట్టణ నడిబొడ్డులో ఉన్న రైతు బజార్‌లో చెత్తాచెదారం, కుళ్లిన కూరగాయలతో అధ్వానంగా మారింది. రైతు బజార్‌లో పరిశుభ్రతను పాటించాల్సిన సూపర్‌వైజర్ సోమవారం తన కార్యాలయంలో గాఢ నిద్రలో కాలం వెళ్ల దీశారు. ప్రతిరోజు ఇదే తరహాలో సదరు అధికారి వ్యవహరిస్తుండడంతో రైతు బజార్‌లోని కూరగాయల విక్రయదారులతో పాటు వినియోగదారుల సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. సూపర్‌వైజర్ తన కార్యాలయంలో నిద్రపోతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పట్టణ ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదరు అధికారిపై ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పహిల్వాన్‌పురంలో సినిమా షూటింగ్



నటీనటులతో చిత్రం యూనిట్

వలిగొండ: మండలంలోని పహిల్వాన్‌పురం గ్రామంలో 'ఆ రామాపురంలో..' సినిమా షూటింగ్ గత రెండు రోజులుగా కొనసాగుతోంది. శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను సోమవారం గ్రామంలో చిత్రీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆత్మహత్యలను నియంత్రించేందుకు హైదరాబాద్ నగరం నుంచి వచ్చిన హీరో చేసే ప్రయత్నమే ప్రధాన ఇతివృత్తంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలోని సుంకిశాల, రెడ్లరేపాక గ్రామంతో పాటు భువనగిరి మండలం రమణేశ్వరం గ్రామంలో పలు సన్నివేశాలను చిత్రీకరించినట్లు పేర్కొన్నారు. హీరోగా రామకృష్ణ, సుమన్, కాలకేయ ప్రభాకర్ తదితరులు ఈ సినిమాలో నటిస్తున్నట్లు తెలిపారు.

పంటల మార్పిడితోనే భూసారం పెంపు



రైతులకు కూరగాయల నారు అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

త్రిపురారం: పంటల మార్పిడితోనే భూసారం పెరుగుతుందని త్రిపురారం మండలంలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కేవీకేలో జిల్లాలోని రైతులకు ఆన్ క్రాప్ డైవర్సిఫికేషన్ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి సీజన్‌లో ఒకే పంటను పండించడం ద్వారా చీడపీడల ఉధృతి పెరిగి పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయన్నారు. వివిధ పంటల సాగులో శాస్త్రీయంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంట మార్పిడి వల్ల కలిగే లాభాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అనంతరం కేవీకేలో షేడ్ నెట్ కింద పెంచిన మిర్చి, బంతి, టమాట, సొర నారును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో బెంగుళూరు వ్యవసాయ శాస్త్రవేత్తలు రాంమూర్తి, రమేష్, చరణ్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, కిరణ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

పెద్దఅడిశర్లపల్లి: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన పర్వతం శివ(16) పెద్దఅడిశర్లపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో చిల్కమర్రి సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎలక్ట్రికల్ పనులు చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి తండ్రి వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన మల్టీపర్పస్ ఉద్యోగి

హుజూర్‌నగర్‌రూరల్: గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ ఉద్యోగి సోమవారం విధి నిర్వహణలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. హుజూర్‌నగర్ మండలం బోరుగడ్డ గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ ఉద్యోగిగా పనిచేస్తున్న పాదిల నాగరాజు సోమవారం గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి పక్క వీధిలో వీధిలైట్లు వేస్తున్నాడు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేయడంతో స్తంభం ఎక్కిన నాగరాజుకు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్తంభం దిగి వచ్చి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించగా అది ఆన్‌లో ఉందని గుర్తించాడు. సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేసిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని నాగరాజు కోరుతున్నాడు.

ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటంకం.. వ్యక్తిపై కేసు

గరిడేపల్లి: ఆర్టీసీ విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన బీమపంగు శ్రీను బైక్‌పై వచ్చి కోదాడ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న బస్సును గరిడేపల్లి మండల కేంద్రంలో ఆపి తన కుటుంబ సభ్యులను ఎక్కించాడు. బస్సు ఆపమన్నా ఆపకుండా వస్తున్నావంటూ తనను కిందకు దింపి విధులకు ఆటంకం కల్గించాడని డ్రైవర్ అందె శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోదాడరూరల్: పట్టణంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న జూదరులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని గోపిరెడ్డినగర్‌లో నివాసముంటున్న నారాయణరెడ్డి ఇంట్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.68,430, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. 11మందితో పాటు పేకాట ఆడేందుకు అనుమతిచ్చిన ఇంటి యజమాని నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైద్య సేవలు 12 గంటలే..!

మోటకొండూరు పీహెచ్‌సీలో అందని నిరంతర వైద్యం

- రెండు వారాల నుంచి సాయంత్రం 6 గంటలకే ఆస్పత్రి మూసివేత
- సిబ్బంది కొరతతో సేవల కుదింపు
- పట్టణ ప్రాంతాలకు వెళ్తున్న రోగులు



మోటకొండూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీ

మోటకొండూర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్యసేవలు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. 24 గంటలు సేవలు అందించాల్సి ఉండగా వైద్యులు, సిబ్బంది కొరత వల్ల సమయం కుదించారు. రోజూ సాయంత్రం ఆరు గంటలకే ఆస్పత్రిని మూసివేస్తున్నారు. దీంతో అత్యవసర సమయంలో రోగులు పట్టణాలు, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో వైద్యసేవలను కుదించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

18 నెలల పాటు 24 గంటల సేవలు

విస్తీర్ణం, జనాభాపరంగా జిల్లాలోనే మోటకొండూరు అతిపెద్ద మండలం. మండలంలో 25వేల జనాభా ఉంటుంది. చివరి గ్రామాలు అత్యవసర వైద్యం కోసం భువనగిరితో పాటు ఇతర పట్టణాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల విజ్ఞప్తి మేరకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటట వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. 2023 జనవరి నుంచి 24 గంటల వైద్య సేవలు అందుతున్నాయి. అందుకు అనువైన భవనం, వసతులు ఉన్నప్పటికీ సిబ్బందిని మాత్రం నియమించలేదు. అయినా ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ఉన్నతస్థాయి ఆదేశాల మేరకు ఉన్నసిబ్బందితోనే 24గంటల వైద్యం అందిస్తూ వచ్చారు. ఏడాదిన్నర గడిచినా పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించకపోవడంతో జూలై 15వ తేదీ నుంచి వైద్య సేవలను 12గంటలకు కుదించారు.

ప్రస్తుతం ఉన్న సిబ్బంది

ప్రస్తుతం పీహెచ్‌సీలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ అసిస్టెంట్, ఇద్దరు స్టాఫ్ నర్సులు ఉన్నారు. ఇందులో ఒక మెడికల్ ఆఫీసర్‌ను ఇటీవల డిప్యుటేషన్‌పై శారాజీపేటకు, ఒక స్టాఫ్ నర్సును డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతానికి పంపారు.

24గంటల సేవలకు కావాల్సిన సిబ్బంది

డిప్యుటేషన్‌పై వెళ్లిన డాక్టర్, స్టాఫ్‌నర్సును తిరిగి తీసుకురావల్సి ఉంటుంది. వీరితో పాటు ఆయా, నైట్ వాచ్‌మన్, రెండు అటెండర్ పోస్టులను భర్తీ చేస్తే సరిపోతుంది. పోస్టులను భర్తీ చేసి 24 గంటల వైద్య సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

సరిపడా సిబ్బంది లేరు



మోటకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటల వైద్యం అందించటానికి సరిపడా సిబ్బంది లేరు. సమస్యను జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు ఈనెల 15వ తేదీ నుంచి 12గంటల వైద్య సేవలు అందజేస్తున్నాం. సిబ్బందిని నియమిస్తే 24గంటల సేవలు అందిస్తాం

– కట్టా విజయ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, మోటకొండూరు

స్టాఫ్‌ను నియమించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అటెండర్లు, నైట్‌వాచ్‌మన్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. దీంతో రాత్రి సమయంలో స్టాఫ్‌నర్సు ఒక్కరే విధులు నిర్వహించాల్సి వస్తుంది. సపోర్ట్ స్టాఫ్‌ను నియమిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. సిబ్బంది లేకపోవడం వల్లే రెండు వారాలుగా 12 గంటల వైద్య సేవలు అందజేస్తున్నాం.

– సుధారాణి, స్టాఫ్ నర్స్, మోటకొండూరు పీహెచ్‌సీ

వీధి దీపాలు లేక ఇక్కట్లు



చీకటిమయమైన ప్రభుత్వ ఆస్పత్రి నుంచి బస్టాండ్ వెళ్లే రోడ్డు



రాత్రివేళ వెలుతురు లేకపోవడంతో డివైడర్‌ను ఢీకొన్న కారు

- జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే దారిలో వెలగని లైట్లు
- అధ్వానంగా రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ప్రయాణికులు

పానగల్: నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోడ్డులో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు చీకట్లో వాహనాలు నడుపుతూ డివైడర్ దిమ్మెకు ఢీకొని గాయాలపాలవుతున్నారు. ఇటీవల భాస్కర్ అనే వాహనదారుడి కారు డివైడర్ దిమ్మెకు ఢీకొని గాయాలపాలయ్యాడు. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు అవస్థలు పడుతున్నారు.

ఆస్పత్రికి వెళ్లే రోడ్లు అధ్వానం..

పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి అయిందంటే ఆ రోడ్డు మొత్తం చిమ్మచీకటి అయి ప్రజలు, వాహనదారులు అక్కడనుంచి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి ఆ రోడ్డుకు కనీస మరమ్మతులు చేయడంతోపాటు ప్రతిరోజు వీధి దీపాలు వెలిగేలా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు వెడల్పు చేయాలి



బస్టాండ్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డును వెడల్పు చేయాలి. దీంతోపాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. ఈ సమస్య పరిష్కరిస్తే వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి.

– కట్టా వెంకటేష్, వాహనదారుడు

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



మేము అన్సారీ కాలనీలో నివాసం ఉంటాం. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండడంతోపాటు వీధి దీపాలు లేక చీకటి మయంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో వీధిదీపాలు ఏర్పాటు చేసి రోడ్ల మరమ్మతులు చేయాలి.

– కొదదల శేఖర్, అన్సారీ కాలనీ వాసి